

దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ములుగు అభ్యర్థి నాగజ్యోతి, పక్కన రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

# దివ్యాంగులకు ఇండ్లు నిర్మించి ఇస్తా

**ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి**

ములుగు, అక్టోబర్26 (నమస్తే తెలంగాణ) : తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అర్హులైన దివ్యాంగులకు ఇండ్లు నిర్మించి ఇస్తానని ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని లీలాగార్డెన్‌లో నియోజకవర్గ దివ్యాంగులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాగజ్యోతి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా నాగజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగులకు పెద్ద దిక్కు సీఎం కేసీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వని విధంగా రూ.4,116 పింఛన్ ఇస్తున్నారని గుర్తుచేశారు. ఎన్నికల అనంతరం విడుతల వారీగా రూ.6వేలకు పెంచి అందజేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని దివ్యాగుల సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేయడంతో పాటు అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చారు. ఆసరా పథకం కింద అందిస్తున్న పింఛన్లను నిలిపివేసేలా కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారని, ఓట్ల కోసం గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని దివ్యాంగులకు సూచించారు. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ దివ్యాంగుల బాగోగులు తెలుసుకొని నెల నెలా పింఛన్ ఇచ్చి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగులను పట్టించుకున్న నాథుడే లేదని తెలిపారు. రెడ్‌కో చైర్మన్ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులందరికీ సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా ఉన్నారని అన్నారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత మొదటి విడుతలో రూ.2016 పింఛన్ ఇచ్చినట్లు చెప్పారు. ఆర్థిక పరిస్థితులు మెరుగు పడిన తర్వాత రెండో విడుత రూ.3016లకు పెంచినట్లు తెలిపారు. ఇవి కూడా సరిపోవడం లేదనే ఉద్దేశంతో ఇటీవల సీఎం కేసీఆర్ రూ.4016లకు పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో విడుతల వారీగా రూ.6వేలకు పింఛన్ పెంచి ఇచ్చేందుకు కేసీఆర్ శ్రీకారం చుట్టారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు దేవ్‌సింగ్, మాజీ మంత్రి చందూలాల్ తనయుడు అజ్మీరా ధరమ్‌సింగ్ పాల్గొన్నారు.

# సంక్షేమాన్ని ఆపే కుట్ర

- రైతులకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి
- లబ్ధిదారులు ఆ పార్టీ నాయకులను నిలదీయాలి
- ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి

ములుగురూరల్, అక్టోబర్ 26 : రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ నాయకులు ఆపే కుట్రలు చేస్తున్నారని ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాష్ట్రంలో రైతు బంధు, దళిత బంధు వంటి పథకాలను నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన సందర్భంగా గురువారం బీఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, ములుగు జిల్లా బీఆర్ఎస్ నాయకులతో కలిసి నాగజ్యోతి విలేకరులతో మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు దిక్కు తోచక కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 80శాతం మంది రైతులున్నారని, వారికి రైతు బంధు నిలిపివేయాలనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. బీడు భూముల తెలంగాణను సస్యశ్యామలం చేసి రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తుంటే కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రాక ముందే ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి వారికి కూడా రైతు బంధు పథకాన్ని వర్తింపజేస్తున్న బీఆర్ఎస్ విధానాన్ని ప్రజలు గమనించాలని కోరారు. సంక్షేమాన్ని అందిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం కావాలో కరువును తెచ్చే కాంగ్రెస్ పాలన కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. ప్రశ్నించే గొంతునని స్టేజీల మీద చెప్పుకునే ఎమ్మెల్యే సీతక్క కాంగ్రెస్ నాయకుల విధానాన్ని ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ నాయకులతో పాటు ఎమ్మెల్యే సీతక్కకు రైతులపై చిత్తశుద్ధి ఉంటే రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

**ఆసరా పింఛన్లు రద్దు చేయాలంటున్న కాంగ్రెస్**

*– దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి*

సంక్షేమ పథకాలైన ఆసరా పింఛన్లను కూడా కాంగ్రెస్ నాయకులు రద్దు చేయాలంటున్నారని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి అన్నారు. 2018లో ప్రవేశపెట్టిన రైతు బంధు పథకంతో పాటు దళిత బంధు పథకాన్ని కూడా ఆపాలనడం కాంగ్రెస్ నాయకుల ఓటమి, భయానికి నిదర్శనమన్నారు. సంక్షేమ పథకాలు ఆపాలని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో 46లక్షల మందికి ఆసరా ఫించన్‌లు అందుతున్నాయని, ప్రజల బాగోగులు ఏ నాడు పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అందుతున్న పథకాలను కూడా ఆపాలని అంటున్నారు.

**ఓటమి భయంతోనే ఫిర్యాదు**

*– రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి*

ఓటమి భయంతోనే సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ అగ్ర నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 10 సీట్లు కూడా గెలవలేమనే పరిస్థితిని తెలుసుకొని ఈ పనులకు పూనుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు పాలిస్తున్న కర్ణాటకలో రైతులు రోడ్డెక్కిన విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. ఇప్పుడు సంక్షేమ పథకాలను వద్దంటున్న కాంగ్రెస్ నాయకులు రేపు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను చెప్పులతో కొట్టి నిలదీయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, నాయకులు పోరిక ధరమ్‌సింగ్, భూక్యా దేవ్‌సింగ్, వెల్పూరి సత్యనారాయణరావు, బేతెల్లి గోపాల్‌రెడ్డి, గజ్జి నగేశ్, కాకి పురుషోత్తం, భూక్యా మురళి, ఆదిరెడ్డి, శరత్ పాల్గొన్నారు.



ములుగు జాతీయ రహదారిపై రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

## రైతు బంధుపై ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు : రెడ్కో చైర్మన్

**ములుగులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

తెలంగాణలో రైతు బంధు, సంక్షేమ పథకాలను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ ములుగు మండల ఎన్నికల ఇన్‌చార్జి, రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్ రెడ్డి అన్నారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రోడ్డుపై బైటాయించి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బంధు నిలిపివేయాలని కాంగ్రెస్ కుట్ర చేయడం అంటే రైతులకు అన్యాయం చేయడమేనని అన్నారు. ఇలాంటి కుట్రలను మానుకొని రైతుల మేలుకు సహకరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా గత సంక్షేమ పథకాలు కొనసాగించవచ్చని ఎన్నికల కమిషన్ చెప్పినా రేవంత్‌రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతులు వెంట పడి తరమాలని పిలుపునిచ్చారు.

# సీఎం కేసీఆర్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

- గ్యారెంటీ లేని కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు
- శ్రీధర్‌బాబు ప్రజలకు చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు
- మహదేవపూర్, మహాముత్తారంలో ముఖ్య కార్యకర్తల సమావేశం

మహదేవపూర్/ మహాముత్తారం, అక్టోబర్ 26 : సీఎం కేసీఆర్ పాలనలోనే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని మంథని నియోజక వర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గ్యారెంటీ లేని కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. కర్ణాటక రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలు చేసి గెలిచిన కాంగ్రెస్ హామీలను విస్మరించిందన్నారు. వ్యవసాయానికి సరిపడా కరెంట్ లేక రైతులు స్వయంగా సబ్ స్టేషన్లలో మొసళ్లను తోలే పరిస్థితి ఉందంటే కాంగ్రెస్ పాలన ఎంత దయనీయంగా ఉందో ఇక్కడి ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఓట్లప్పుడే మాత్రమే శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులకు ప్రజలు గుర్తుకు వస్తరని, తర్వాత కంటికి కూడా కనిపించరని తెలిపారు. నియోజకవర్గంలో 40 సంవత్సరాల్లో శ్రీధర్‌బాబు చేయని అభివృద్ధిని తాను 2014లో ఎమ్మెల్యేగా గెలిచి నాలుగేండ్లలో చేసి చూపించానన్నారు. నోట్ల కట్టలతో నాయకులను కొనే నీచ సంస్కృతి కాంగ్రెస్‌దని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో అసత్య ప్రచారాలు నమ్మి తనను దూరం చేసుకున్నారని, అయినా తాను పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన 2023 ఎన్నికల మ్యానిఫెస్టోతో పాటు తాను ఎమ్మెల్యే గెలిస్తే హైదరాబాద్‌లో చదువుకునే విదార్థులకు సొంత డబ్బులతో హాస్టళ్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహాముత్తారం ప్రజలు బీఆర్ఎస్‌కు మూడు వేల ఓట్ల మెజార్టీ ఇస్తారని సర్వేలు చెప్తున్నాయన్నారు. భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్ మాట్లాడుతూ యువత బీఆర్ఎస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు గడపగడపకూ చేరాయని చెప్పారు. అనంతరం మహదేవపూర్, బొమ్మాపూర్, రాపల్లికోటతో పాటు పలు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది యువకులు, మహాముత్తారం మండలం సింగారం, ప్రేమ్‌నగర్, పెగడపల్లి, స్తంభంపల్లి పీపీ, గండికామారం గ్రామాల నుంచి వంద మంది బీఆర్ఎస్‌లో చేరగా వారిని మధు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, పలిమెల మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, కాటారం ఏఎంసీ చైర్ పర్సన్ పెండ్యాల మమతా మనోహర్, వైస్ ఎంపీపీ బండం పుష్పలత, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు బండం లక్ష్మారెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మండల మహిళా అధ్యక్షురాలు ఓడేటి పద్మా మల్లారెడ్డి, సర్పంచులు శ్రీపతిబాపు, నాగుల లక్ష్మారెడ్డి, వసంత మోహన్ రెడ్డి, కురుసం సత్య, ఓడేటి పద్మ, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ డైరెక్టర్లు సిద్ధాంతి భానుప్రకాశ్, కలికోట దేవేందర్, సీనియర్ నాయకులు అన్కారి ప్రకాశ్, కూరతోట రాకేశ్, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీం, కాళేశ్వర ఆలయ మాజీ చైర్మన్ పోత వెంకటస్వామి, మహాముత్తారం మండలాధ్యక్షుడు కల్వాచర్ల రాజు, మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ సోమశాంతకుమార్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు లింగమల్ల రమాదేవి, ఎంపీటీసీలు శ్రీపతి సురేశ్, అర్జున్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు దూలం మల్లయ్యగౌడ్, కాటారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి, కాటారం సబ్ డివిజన్, మహాముత్తారం బీఆర్ఎస్ అధికార ప్రతినిధులు జగన్‌నాయక్, బాలాజీ, బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు జైపాల్‌నాయక్, సోషల్‌మీడియా ఇన్‌చార్జి కొర్రోళ్ల శ్రీనివాస్, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు రూపానాయక్, కాళేశ్వరం ఆలయ ధర్మకర్త మెండ వెంకటస్వామి పాల్గొన్నారు.



మహదేవపూర్ : కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంథని అభ్యర్థి పుట్ట మధు, పక్కన భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి

**బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు**

కాటారం, అక్టోబర్ 26 : మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు, భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి సమక్షంలో పార్టీలో చేరారు. వారిలో జోడు సత్యం, నాయిని సమ్మయ్య, జోడు రాజు, జోడు మధుకర్, నాయిని నాగరాజు, నాయి ని సుమన్, దోమల రాజబాబు, కుసుమ సతీశ్, పోతుల వెంకటేశ్, నాయిని శేఖర్, గడిచెర్ల రాహుల్, గడిచెర్ల హరీశ్ ఉన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు జక్కు రాకేశ్, పార్టీ మండల అధ్యక్షుడు జోడు శ్రీనివాస్, రామిల్ల కిరణ్, నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పంతకాని సడవలి, ఉపాధ్యక్షుడు గాలి సడవలి, మండల అధ్యక్షుడు కొండగొర్ల వెంకటస్వామి, మండల యూత్ ఉపాధ్యక్షుడు ముక్తి తిరుపతి, పీఏసీఎస్ డైరెక్టర్ మారుపాక రాజేశ్వరి పాల్గొన్నారు.